సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 13 । జనవరి । 2024



టమాట కిలో రూ.18
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం అమ్మకాలు సాగాయి.



ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు
జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి దంపతులు విజేతలకు బహుమతులు అందజేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.5°/ 12.3°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

పేదలకు కార్డు భాగ్యం

కొత్త బియ్యం కార్డులొచ్చాయ్

- జిల్లాకు 5,205 కార్డుల మంజూరు
- కొత్త కార్డులకు ఈ నెల నుంచే రేషన్

పుట్టపర్తి అర్బన్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్ సర్కార్..అర్హతే ఆధారంగా ఎప్పటికప్పుడు సంక్షేమ పథకాలు అందేలా చూస్తోంది. గతానికి భిన్నంగా దరఖాస్తు చేసిన వెంటనే బియ్యం కార్డులు అందిస్తోంది. ఈక్రమంలోనే జిల్లాకు కొత్తగా 5,205 బియ్యం కార్డులు మంజూరు చేసింది. ఆరు నెలల వ్యవధిలో రెండోసారి నూతన బియ్యం కార్డులు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో సంతోషం నెలకొంది.

ఎవరి సిఫార్సు లేకుండానే మంజూరు..
గతంలో బియ్యం కార్డు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. అయితే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అర్హత ఉంటే చాలు వలంటీరే ఇంటివద్దకు వచ్చి దరఖాస్తు చేయిస్తున్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సైతం వారే తీసుకువెళ్లి సచివాలయాల్లో అందజేసి నూతన బియ్యం కార్డులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వెనువెంటనే కార్డులు మంజూరు చేస్తుండగా పేద కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 5.64 లక్షల కార్డులు..
ప్రభుత్వం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు నూతన బియ్యం కార్డులు మంజూరు చేసింది. 2023 ఆగస్టులో 3,384 కార్డులు లబ్ధిదారులకు అందజేసింది. తాజాగా ఈ నెలలో మరో 5,205 మందికి బియ్యం కార్డులిచ్చింది. మొత్తంగా ఆరు నెలల కాలంలోనే జిల్లాలో కొత్తగా 8,589 మందికి బియ్యం కార్డులిచ్చింది. ప్రస్తుతం జిల్లాలో 5,64,298 బియ్యం కార్డులున్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతి నెలా 8,750 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. అలాగే తక్కువ ధరకే పంచదార, కందిపప్పు, రాగులు, గోధుమపిండి తదితర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల ఇళ్ల ముంగిళ్లలోనే అందిస్తోంది.

జనవరి కోటా రేషన్ పంపిణీ..
కొత్తగా మంజూరు చేసిన బియ్యం కార్డులను ప్రభుత్వం నేరుగా ఆయా సచివాలయాలకు పంపింది. లబ్ధిదారుడు సచివాలయానికి వెళితే కార్డు ప్రింట్ తీసి వెంటనే అందజేస్తారు. కొత్త కార్డుదారులకు ఈ నెల నుంచే బియ్యం, రాగులు, చక్కెర, కంది బేడలు అందజేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు.



5,205 కొత్తగా మంజూరైన బియ్యం కార్డులు

8,589 ఆరునెలల వ్యవధిలో మంజూరైన కార్డులు

5,64,298 ప్రస్తుతం జిల్లాలోని బియ్యం కార్డుల సంఖ్య

8,750 మెట్రిక్ టన్నులు కార్డుదారులకు ప్రతి నెలా అందజేసే బియ్యం

మండలాల వారీగా నూతన రేషన్ కార్డులు మంజూరు ఇలా...

మండలం	కార్డుల సంఖ్య	మండలం	కార్డుల సంఖ్య
అగళి	114	అమడగూరు	94
అమరాపురం	188	బత్తలపల్లి	133
బుక్కపట్నం	96	చెన్నేకొత్తపల్లి	184
చిలమత్తూరు	125	ధర్మవరం	533
గాడ్లపెంట	83	గోరంట్ల	290
గుడిబండ	18	హిందూపురం	109
హిందూపురం అర్బన్	293	కదిరి	317
కనగానపల్లి	223	కొత్తచెరువు	128
లేపాక్షి	43	మడకశిర	160
ముదిగుబ్బ	163	నల్లచెరువు	87
నల్లమాడ	148	ఎన్పీ కుంట	104
ఓడీ చెరువు	149	పరిగి	257
పెనుకొండ	123	పుట్టపర్తి	153
రామగిరి	111	రొద్దం	156
రొళ్ల	184	సోమందేపల్లి	101
తాడిమర్రి	127	తలుపుల	109
తనకల్లు	102	మొత్తం	5,205



ప్రశాంతిగ్రామంలో లబ్ధిదారుడికి నూతన బియ్యం కార్డు అందజేస్తున్న సీఎస్డీటీ రమేష్

దరఖాస్తు చేసిన వెంటనే మంజూరు..



నేను రేషన్ కార్డు కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. ఈ నెలలో కార్డుతో పాటు రేషన్ అందజేశారు. గతంలో రేషన్ కార్డు కావాలంటే చాలా ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం సచివాలయంలో వలంటీర్ ద్వారా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేశారు. ఇలాంటి సంక్షేమాన్ని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు.
– శ్వేత, పెడపల్లి, పుట్టపర్తి మండలం

కొత్తకార్డులకూ సరుకులు



జిల్లాలో కొత్తగా 5,205 కుటుంబాలకు బియ్యం కార్డులు మంజూరయ్యాయి. వీటికి సరిపడా రేషన్ సరుకులు సైతం ఇప్పటికే సరఫరా చేశాం. కొత్తగా కార్డు పొందిన వారంతా ఈనెల కోటా పొందవచ్చు. ప్రస్తుతం జిల్లాలో 5.60 లక్షల కార్డులుండగా, ప్రతి నెలా 8,700 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.
– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

- సామాజిక సమతా సదస్సులో డీఆర్ఓ కొండయ్య



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

పుట్టపర్తి అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గం అనుసరణీయమని, ఆ మహాత్ముడు చూపిన సామాజిక న్యాయమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని డీఆర్ఓ కొండయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సామాజిక సమతా సంకల్ప సదస్సు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్ఓ మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈనెల 19న విగ్రహ ఆవిష్కరణ ఉంటుందన్నారు. ప్రజలందరికీ ఈ విషయాన్ని తెలియజేసి, మంచి కార్యక్రమంలో వారందరినీ భాగస్వాములు చేయాలన్న ఉద్దేశంతో సామాజిక సమతా సదస్సు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం సదస్సుకు విచ్చేసిన పలువురు మాట్లాడుతూ, శ్మశాన వాటికలకు సంబంధించిన సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు. పుట్టపర్తిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల సేకరణ త్వరగా చేయాలన్నారు. భావి తరాలకు అంబేడ్కర్ గురించి తెలిపేందుకు భారీ విగ్రహ ఏర్పాటుతో చేస్తున్న సీఎం జగన్ సర్కార్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగప్రసాద్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంగాధర్, శ్రీనివాసులు, రామమూర్తి, కుల సంఘాల నాయకులు ఆనందమూర్తి, వీరనారాయణ, మల్లికార్జున, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

16న పాలసముద్రానికి ప్రధాని మోదీ!



నాసిన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

పెనుకొండ/గోరంట్ల: ప్రధాని మోదీ జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) ప్రారంభోత్సవానికి ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశముంది. అయితే దీనిపై ఇప్పటి వరకూ అధికారిక సమాచారం లేనప్పటికీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ నాసిన్‌లో పర్యటించారు. సంస్థ అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, వీఐపీ గ్యాలరీ ఏర్పాట్లను చూశారు. అసంపూర్తిగా ఉన్న పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో నాసిన్ సంస్థ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఎంవీఐ కార్యాలయం

ధర్మవరం రూరల్: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కృషి ఫలించింది. ధర్మవరంలో నూతనంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ప్రస్తుతం ధర్మవరం వాసులంతా వాహన ఫిట్‌నెస్ కోసం కదిరికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయం, డబ్బు వృథా అవుతుండేవి. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి ధర్మవరం వాసుల సౌలభ్యం కోసం ధర్మవరంలోనే మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. స్పందించిన ప్రభుత్వం ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి తదితర 6 మండలాల కోసం ధర్మవరంలో రవాణా శాఖ కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేస్తూ జీఓ ఇచ్చింది. అలాగే పోస్టులు భర్తీకి కూడా బడ్జెట్ మంజూరు చేస్తున్నట్లు జీఓలో పేర్కొంది. ఈ కార్యాలయం సేవలు ప్రారంభమైన డ్రైవింగ్ టెస్టులు, రిజిస్ట్రేషన్ సేవలు, పునరుద్ధరణ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తదితర వాటిని ఇక్కడే పొందవచ్చు.

వీరభద్రుని సేవలో జాయింట్ కలెక్టర్



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో వెలసిన వీరభద్రస్వామిని శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని శిల్పాలు, చిత్ర లేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వీరభద్రస్వామి, దుర్గాదేవిలకు పూజలు చేశారు. అనంతరం ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. తహసీల్దార్ బాబుతో పాటు రెవెన్యూ సిబ్బంది వారి వెంట ఉన్నారు.





దేమకేతేపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , చిత్రంలో సమన్వయకర్తలు దీపిక, శాంతమ్మ   సభకు హాజరైన ప్రజలు

అభివృద్ధికి పట్టం కట్టండి

- చంద్రబాబు బూటకపు హామీలు నమ్మకండి
- హామీలన్నీ అమలు చేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- హిందూపురంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలి
- చిలమత్తూరు పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిలమత్తూరు: హిందూపురం ముఖచిత్రం మారాలంటే అభివృద్ధికి పట్టం కట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. హిందూపురం నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం వైఎస్సార్ సీపీ హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలు టీఎన్ దీపిక, బోయ శాంతమ్మలతో కలిసి శుక్రవారం మండలంలోని వీరాపురం, దేమకేతేపల్లి, టేకులోడు, శెట్టిపల్లి, కోడూరు, కొడికొండ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడారు. ఇన్నాళ్లూ ప్రజల గురించి పట్టించుకోని చంద్రబాబు ఎన్నికల వేళ ఏదో రకంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలవిగాని హామీలతో నమ్మించి మోసం చేయడం బాబు నైజమని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంతసేపు రాజకీయం తప్ప నమ్మి ఓటేసి ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అందువల్లే రేపు కుప్పంలో చంద్రబాబు చిత్తుచిత్తుగా ఓడటం ఖాయమన్నారు. ఆయన బాటలోనే నడుస్తూ అతిథిలా ఆర్నెళ్లకు ఒకసారి వచ్చివెళ్లే బాలకృష్ణకూ ఈసారి పరాభవం తప్పదన్నారు. విద్య, వైద్య రంగాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కుల,మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్నా, అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అందువల్ల బాగా ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు.

హిందూపురంలో విజయభేరి మోగిస్తాం..
రానున్న ఎన్నికల్లో హిందూపురంలో తప్పకుండా విజయభేరి మోగిస్తామని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ అన్నారు. నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉందన్నది వారి భ్రమ మాత్రమే అన్నారు. ఈసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను లూటీ చేశారని మండిపడ్డారు. ఇప్పుడా పరిస్థితి లేదని, సీఎం జగన్ పేదల పక్షపాతి అని, సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మాట్లాడుతూ, చుట్టం చూపుగా వచ్చే బాలకృష్ణ ఎమ్మెల్యే కావడం మన దురదృష్టమన్నారు. ఈసారి ప్రజలంతా చైతన్యవంతులై జనరంజక పాలన అందించే జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, జెడ్పీటీసీ అనూష, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీపతిరెడ్డి, తిరుమలేష్, చామంతి, మురళీమోహన్, లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీలు జగన్‌మోహన్‌రెడ్డి, మంజునాథరెడ్డి, ఆదినారాయణ, సింగిల్ విండో చైర్మన్లు హనుమంతరెడ్డి, దివాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి, యువజన విభాగం నేత సురేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

పుట్టపర్తి టౌన్: అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తరలిస్తున్న వారిపై సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అడిషనల్ ఎస్పీ విష్ణు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. సీకేపల్లి సెబ్‌స్టేషన్ పరిధిలో 100 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. అలాగే తనకల్లు, హిందూపురం, కదిరి, పుట్టపర్తి సెబ్ స్టేషన్ల పరిధిలో దాడి చేసి, 124 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.

సమష్టిగా పోరాడదాం.. సత్తా చాటుదాం

- పెనుకొండలో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే
- టీడీపీ వారు చేసే తప్పుడు ప్రచారం నమ్మొద్దు
- రొద్దంలో పర్యటించిన మంత్రి ఉషశ్రీచరణ్



సమావేశానికి హాజరైన ప్రజలు



నారనాగేపల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

రొద్దం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, జగనన్న అభిమానులు, నాయకులు అందరం సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో విజయభేరి మోగిద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె మండలంలోని తాడంగిపల్లి, మోపుర్లపల్లి, ఎం కొత్తపల్లి, గౌరాజుపల్లి, రొద్దకంపల్లి, నారనాగేపల్లి, కనుమర, నాగిరెడ్డిపల్లి, బూచర్ల, ఆర్ఎల్ కొత్తూరు, ఆర్ లోచెర్ల గ్రామాల్లో పర్యటించారు. అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ..మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారనాగేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తాను ఎక్కడికి వెళ్లినా అభిమానంతో అక్కున చేర్చుకుంటున్నారని, మీ అందరి మద్దతుతో పెనుకొండపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి తీరుతానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో జనమంతా మద్దతుగా నిలుస్తున్నారని, దీన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు, టీడీపీ నేతలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారు ఎన్ని గిమ్మిక్కులు చేసినా జగన్ ప్రభంజనాన్ని అడ్డుకోలేరన్నారు. తనను ఇంతలా ఆదరిస్తున్న పెనుకొండ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానన్నారు. అంతకుముందు మంత్రి ఉషశ్రీ చరణ్ వ్యవసాయ పొలాల్లో పనులు చేస్తున్న రైతులు, కూలీలను పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. అనేక సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థిక అండనిచ్చిన జగనన్నకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నారనాగేపల్లి ఎంపీటీసీ పద్మావతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, ముఖ్య నాయకులు అక్కులప్ప, ఎస్.నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ప్రభాకర్

అమడగూరు: మండలంలోని పూలకుంటపల్లికి చెందిన ప్రభాకర్ (42) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాలమేరకు.. పూలకుంటపల్లికి చెందిన ప్రభాకర్‌కు రెండు వివాహాలు అయ్యాయి. కుటుంబ కలహాల వలన ఇద్దరు భార్యలు అతనితో విడిపోగా ఒక్కడే ఉంటుండేవాడు. ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఏమైందో తెలీదు కాని శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి రామచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బలరామయ్య తెలిపారు. మృతునికి ఇద్దరు భార్యలతో పాటుగా కుమార్తె ఉంది.

చేనేతల మద్దతు వైఎస్సార్‌సీపీకే..

- వైఎస్సార్‌సీపీలోకి పలువురు చేనేత ప్రముఖులు, కార్మికుల చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు బైక్ ర్యాలీగా వెళ్తున్న చేనేతలు

ధర్మవరం: ప్రతి ఒక్క కార్మికునికి సంక్షేమాన్ని అందించి చేనేత రంగానికి జవసత్వాలు నింపుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చేనేతలంతా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు, చేనేత ప్రముఖుడు దాసరి రంగయ్య, వేణుగోపాల్, హరీష్, ధన, ప్రకాష్, గిరి, గణేష్, బాలకృష్ణ, జగదీష్, నవీన్, కార్తీక్, బాబావలితో పాటు 60 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు చేనేతలంతా బైక్‌పై ర్యాలీ చేశారు. స్థానిక కాలేజ్ సర్కిల్ వద్ద భారీ క్రేన్‌తో ఏర్పాటు చేసిన గజమాలను ఎమ్మెల్యేకు వేసి సత్కరించారు.

టీడీపీ హయాంలో చేనేత రంగం నిర్వీర్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. అప్పట్లో రోజంతా కష్టపడినా కనీస వేతనం లేక చేనేత కార్మికులు అల్లాడిపోయే వారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24వేలు యేడాదికోసారి ఇచ్చి ఆదుకుంటోందన్నారు. ఇప్పటి దాకా ఐదు విడతలుగా నేతన్ననేస్తం పథకం కింద ఒక్కో కార్మికుని కుటుంబానికి రూ.1.20 లక్షల లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. తద్వారా మగ్గాలను అభివృద్ధి చేసుకుని కార్మికులు మెరుగైన సంపాదన పొందుతున్నారన్నారు. సబ్సిడీతో మగ్గం పనిముట్లు, ఎంఎస్‌ఎంఈ ద్వారా రాయితీ రుణాలు, ముద్రారుణాలను కార్మికులకు అందించినట్లు చెప్పారు. అందుకే చేనేతల మద్దతు సంపూర్ణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందన్నారు. చేనేతలంతా శ్రమించి రానున్న రోజుల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ గడ్డం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కాచర్ల అంజి, తరుణికంటి రమేష్, లాయర్ క్రిష్ణ, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, బ్రహ్మ, చాంద్‌బాషా, బడన్నపల్లి కేశవరెడ్డి, పెనుజూరు నాగరాజు, కృష్ణాపురం జమీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగులకు ఉపాధి



జిల్లా స్థాయి జాబ్‌మేళా ప్రారంభించిన అబ్దుల్‌ఖయూమ్ తదితరులు

మడకశిర: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయూమ్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆయన జిల్లా స్థాయి మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంచడానికి శిక్షణ నిమిత్తం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో కూడా జాబ్‌మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మడకశిరలో జరిగిన జిల్లా స్థాయి మెగా జాబ్ మేళాలో 11 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. 266 మంది నిరుద్యోగులకు హాజరుకాగా 103 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తెలిపారు.

మార్కెట్లోకి 'ఎంజీ ఆస్టర్' కారు



కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై - బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెన్విన్ ఆటో మోటర్స్ షోరూంలో శుక్రవారం సాయంత్రం నూతన ఎంజీ ఆస్టర్-2024 వాహనాన్ని షోరూం అధినేత ఉదయ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతితో పాటు కర్నూలు, అనంతపురం, నెల్లూరులోని తమ బ్రాంచుల్లో ఒకేసారి ఈ కారును మార్కెట్‌లోకి తీసుకురావడం జరిగిందన్నారు. వాహన ప్రారంభ ధర రూ.9.98 లక్షలు ఉందన్నారు. ఏడీఎస్ఎస్-ఎల్2 ఫీచర్లతో పాటు 49 సేఫ్టీ ఫీచర్స్, అతిపెద్ద సన్‌రూఫ, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లు కారులో పొందుపరిచనట్లు చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఎంజీ కొనుగోలుపై గోల్డ్‌కాయిన్‌తో పాటు రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా, యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయాలను కాపాడుకోవాలి



పండుగ సంబరాల్లో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ముందస్తు సంక్రాంతి పేరుతో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళా కానిస్టేబుళ్లు, పోలీసులు కుటుంబాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి దంపతులు విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో కానిస్టేబుల్ పద్మశ్రీ, మంజుల, హేమలత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా, వారికి ఎస్పీ దంపతులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, పాశ్చాత్య పోకడలతో కనుమరుగవుతున్న తెలుగు సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఎస్పీ దంపతులను ఏఆర్ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఆర్ఐలు టైటాస్, నారాయణ, సీసీ రాఘవేంద్ర, ఆర్ఎస్ఐలు శ్రీరాములు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

సాయి సూక్తులే సన్మార్గానికి సోపానాలు



నాటికలోని సన్నివేశాలు



ప్రశాంతి నిలయం: సన్మార్గంలో పయనించాలనుకునే ప్రతి ఒక్కరూ సత్యసాయి సూక్తులు పాటించాలన్న సందేశాన్నిస్తూ విద్యార్థులు నిర్వహించిన నాటిక భక్తులను ఆలోచింపజేసింది. సత్యసాయి క్రీడా సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా శుక్రవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత ప్రశాంతి నిలయానికి చెందిన శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు 'తదాత్మానామ్ శ్రీజమ్యహమ్' పేరుతో నాటిక నిర్వహించారు. ఆధునిక మానవుడు చెడు మార్గాలు అనుసరిస్తూ మానవ ధర్మాన్ని మరిచిపోతున్నాడని, తద్వారా లోకంలో ధర్మం మాయమవుతోందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సత్యసాయి బోధనలు పాటిస్తూ సన్మార్గంలో పయనిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలవాలన్న సందేశంతో నాటకం సాగింది. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

తిమ్మమ్మమర్రిమానును జాతీయ స్మారకంగా గుర్తించండి



కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్‌కు వినతిపత్రం అందిస్తున్న జాస్తి వీరాంజనేయులు

ఎన్పీకుంట: తిమ్మమ్మమర్రిమానును జాతీయ స్మారకంగా గుర్తించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ యదుభీర్‌సింగ్‌రావత్‌కు వినతి పత్రం అందించారు. తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతానికి కేంద్ర పురావస్తుశాఖ బృందాన్ని పంపించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని కోరారు. ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

శ్రీనివాస అకాడమి

■Coaching for Phy/Chem. NEET/JEE Inter - I, II Yr Tutions for MPC/BiPC. Free - Tutions for SSC only -1- Month. Cont: 9618562274. [A-7418]

DISTANCE EDUCATION

■ ఆంధ్ర యూనివర్శిటీ & ANU అడ్మిషన్స్ జరుగుచున్నవి B.A, B.Com, B.Sc, (TM/EM) (All Groups), M.A, M.Com, M.Sc (All Subjects) M.B.A, M.S.W, B.Li.Sc, M.Li.Sc. డా॥ బి. మధుసూధన. ఫోన్ : 83282 79245. [V- 6942]

REAL ESTATE

PLOT FOR SALE

■ అనంతపురము కక్కలపల్లిలో గౌతమి విల్లాస్ దగ్గర సర్వే నెం. 32/1B లో ప్లాట్ నెం.39 (8.84 సెంట్లు) అమ్మకానికి కలదు. సంప్ర : 99667 78780, 63043 67885. [A-2800]

FOR SALE

■ ATP - కక్కలపల్లి, రెసిడెంటిల్ ప్లాట్, సాక్షి ఆఫీస్ టమాటో మండి వెనకాల, 10 సెంట్లు 40 లక్షలకే. సెల్: 9490751009, 9441109053 [HA-8042]

FOR RENT

■ ATP, సాయి నగర్ మెయిన్ రోడ్ నందు, 800 చ.అ. కమర్షియల్ స్పేస్, సెల్లార్ ఫ్లోర్ లో బాడుగకు కలదు. ఫైనాన్స్, చిట్స్, ఏజెన్సీ ఆఫీస్‌లకు అనువైనది. సెల్ : 99490 59834. [A-1533]

COMMERCIAL SPACE

■ ATP, రామ్‌నగర్, మెయిన్ రోడ్‌కు (HP పెట్రోల్ బంక్ ప్రక్కన) కమర్షియల్ కొరకు 2500+2500 Sft. వైశాల్యం గల హాల్ (G1, G2, G3లు) బాడుగకు కలవు. సెల్ : 9490695786 [A-1523]

స్థలం అమ్మబడును

■ 20 Cents కార్నర్ Plot నందు 30000 sq.ft. నిర్మింపబడి నెలకు 3 ½ లక్షల బాడుగ వచ్చుచున్న 5 అంతస్తుల బిల్డింగ్ Housing bard (New Rev Col) నందు అమ్మకమునకు కలదు. ఫోన్ : 94405 66667. [A-7391]

FLATS FOR SALE

■ అనంతపురము, ఆలమూరు AHUDA ఆమోదిత లేఅవుట్ మహతి గ్రూప్ GMR కాలనీలో కొత్త విల్లా ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్రదించండి : 9121510333, 9392183377, 9281024684. [A-1535]

■ రాప్తాడు, బెంగళూరు హైవే AHUDA ఆమోదిత లేఅవుట్ మహతి గ్రూప్ PLEASANT VALLEY లో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర : 9121510333, 9392183377, 9281024684. [A-1536]

■ A.P. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ హంపాపురం ప్రక్కన NH44 వద్ద AHUDA ఆమోదిత లేఅవుట్ మహతిగ్రూప్ హైవే కౌంటీలో కొత్త ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర : 9121510333, 9392183377, 9281024684. [A-1537]

FLATS FOR SALE

■ Red Rock Rubyx Apartments, New Revenue Colony, RTO Office Road, Besides Sri Chaitanya School, Anantapur Town.12500 Sq.ft luxuriously planned, well ventilated, amazing Infra Structure and Amenities. Occupation by April 2024. Contact Number: 9908887674. [A-7393]

HOUSE FOR RENT

■ WELL FURNISHED 2BHK HOUSE IN RAJAHAMSA RESIDENCY APARTMENT FLAT NO: 102, NEAR RTC BUS STAND, ANANTAPUR. CONT: 91002 77781 OR 92247 70108. [A-7386]

TO-LET

■ధర్మవరం, పార్థసారధినగర్, హోండా షోరూం ఎదురు, RSN ప్లాజా నందు 1st & 2nd ఫ్లోర్ (ప్రతి ఫ్లోర్ 1270Sq.ft) కమర్షియల్ స్పేస్ బాడుగకు ఇవ్వబడును. Ph:9704090292, 9989698499. [NA-11607]

SERVICES

దుర్గాదేవి జ్యోతిష్య పీఠం

■ దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: ఎస్.వి. రాఘవేంద్ర జోషి, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపగలరు. ✆ 6384 999 444 [B-1255221]

WANTED

■ Jobs : ధర్మవరం నందు గల MNC కంపెనీలో వర్క్ చేయడానికి బాయ్స్ / గర్ల్స్ కావలెను. (Work From Home కూడా కలదు) సంప్ర : 9030661651, కళా జ్యోతి సర్కిల్, ధర్మవరం. [A-2798]

■ ధర్మవరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ KSR సంస్థలో పనిచేయుటకు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ స్త్రీ/పురుషులు కావలెను. జీతం + ఇన్సెంటివ్స్ కలవు. సెల్ : 6301801386. [A-1520]

■ వృద్ధాశ్రమములో పనిచేయుటకు వర్కర్లు కావలెను. ఉచిత భోజనము వసతితో పాటు జీతము ఇవ్వబడును. సంప్ర : 96520 61377, 80746 15073. [A-1534]

■ త్వరలో ప్రారంభం కానున్న మారుతి కార్స్ షోరూమ్స్ నందు పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం, కదిరి, తాడిపత్రి ప్రాంతాలకు కావలెను. వెంటనే సంప్ర : సెల్ : 9154255330. [A-784522]

■ అనంతపురము లోకల్‌లో ప్రముఖ హాస్పిటల్ నందు జాబ్ చేయడానికి Male / Female కావలెను. సంప్ర : జి. మురళీ, 9030661651, అనంతపురము. [A-1527]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221898]

■ హిందూపురం-అనంతపురం జిల్లా మునిసిపాలిటి నందు (Clap programme) చెత్తసేకరణ ఆటోలను పర్యవేక్షించేందుకు సూపర్‌వైజర్స్, అనుభవం గల ఆటోడ్రైవర్లు కావలెను. ✆ 89779 37517, 8978 111 397. [B-190932]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167591]

■ మా హోమ్ లో వృద్ధులు, పిల్లల కేర్ టేకర్స్, జీ:10-15 వేలు & సెక్యూరిటీ గార్డ్స్ జీ:8 వేలు వంటచేయు స్త్రీలు కావలెను. జీ:10-20వేలు, వసతి+భోజనం.# ATP. 9010387993. [A-784524]

■ ప్రముఖ NGO వారి సెంట్రల్ స్కీమ్ వర్క్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & కిసాన్ లోన్స్ చేయుటకు యువతి యువకులు కావలెను. ఫోన్ : 9000977523, 8125983546. [A-2799]

■ అనంతపురము లోకల్ Opp. షిరిడి సాయి బేకరి, సూర్యనగర్‌లో ఆఫీస్ రిసెప్షనిస్ట్ కావలెను. Q : డిగ్రీ + కంప్యూటర్ నాలెడ్జ్, జీతం : 8 వేలు & పెయింటింగ్ తయారీ కంపెనీలో పనిచేయుటకు 20 మంది బాయ్స్ కావలెను. భోజనం, రూమ్ ఫ్రీ. జీతం : 20 వేలు, సెల్ : 77996 90659. [A-784523]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పాపిరెడ్డిది హత్యే

- ఆస్తి కోసం భార్యా, పిల్లల ప్లాన్
- తెలిసిన వారితోనే హత్య చేయించిన వైనం
- కటకటాల్లోకి భార్య,కుమారుడు, కుమార్తెతో పాటు మరో ఇద్దరు



నిందితుల్ని అరెస్ట్ చేసి చూపుతున్న పోలీసులు



బాలంరెడ్డి పాపిరెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: మానవ సంబంధాలు మంటగలసిపోతున్నాయి. ఆస్తి వ్యవహారాలు సొంత వాళ్లనే మట్టుబెట్టే దాకా తీసుకెళ్తున్నాయి. కట్టుకున్న భర్తను కడతేర్చడానికి భార్య కొందరితో ఒప్పందం చేసుకుంటే... దానికి కుమారుడు, కూతురు సైతం వంతపాడారు. ముదిగుబ్బ మండలంలో జరిగిన ఈ ఘటన జిల్లాలో సంచలనం రేపుతోంది.

సోదరుడి ఫిర్యాదుతో...

మండల పరిధిలోని నాగారెడ్డిపల్లికి చెందిన బాలంరెడ్డి పాపిరెడ్డి(60)ది హత్యేనని పోలీసులు తెలిపారు. ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు... పాపిరెడ్డి సోదరుడు బాలం కృష్ణారెడ్డి తన అన్న రెండు నెలలుగా కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పృథ్వీతేజ, సీఐ యతీంద్ర గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు గాలిస్తున్న విషయం తెలుసుకొన్న పాపిరెడ్డి భార్య లక్ష్మీదేవి, కూతురు తేజస్విని, కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన శివారెడ్డి, బచ్చేటి జయరాములు భయపడి వీఆర్‌ఓ ద్వారా సీఐ ఎదుట లొంగిపోయి నేరాన్ని అంగీకరించారు. ఆస్తి విక్రయంపై పాపిరెడ్డితో భార్య, కూతురు, కుమారుడు ఒత్తిడి తెచ్చారు. దీనికి పాపిరెడ్డి ససేమిరా అనడంతో ఎలాగైనా ఆస్తిని కూతురు పేరిట రాయించుకోవాలని కుటుంబ సభ్యులు భావించారు. చాలా నమ్మకస్తులైన శివారెడ్డి, బచ్చేటి జయరాములను సంప్రదించారు. వారంతా కలిసి పాపిరెడ్డిని అడ్డు తొలగించుకునే విధంగా పథకం వేశారు. వారికి రూ.1,70,000 ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. వారిద్దరూ గత ఏడాది నవంబర్ 10వ తేదీన పాపిరెడ్డిని మద్యం సేవిద్దామని చెప్పి గ్రామం వెలుపల చీకిరేవుకుంట వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మత్తులో ఉన్న పాపిరెడ్డి తలపై బండరాయితో మోది హత్య చేశారు. అక్కడే ఉన్న జమ్ములో (పొదలో) శవాన్ని దాచిపెట్టారు. హత్యతో సంబంధం ఉన్న బాలంరెడ్డి లక్ష్మీదేవి, మాయకుంట్ల శివారెడ్డి, బచ్చేటి జయరాములు, చెరుకు తేజువతి, బాలంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ఖాజావలి, సిబ్బంది పాల్గొన్నారు.

27 మంది జూదరుల అరెస్ట్

ఎన్పీకుంట: మండల పరిధిలోని టీ.ఎస్.పల్లి గ్రామ పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న 27 మంది జూదరులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం తెలుసుకొని స్పెషల్ పార్టీ పోలీసులతో పేకాట స్థావరంపై దాడులు చేశామన్నారు. 27 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,24,900తో పాటు 14 ద్విచక్ర వాహనాలు, 21 సెల్‌ఫోనులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో స్థానిక ఎస్‌ఐ ఎన్.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.